న్యూక్లియర్ రేస్!

అణ్వాయుధాలను పెంచుకుంటున్న ప్రపంచ దేశాలు

రెండేండ్లలో 100 వార్‌హెడ్ల సమకూర్చుకున్న చైనా



న్యూఢిల్లీ: మరో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్న వేళ, ప్రపంచ దేశాల మధ్య అణ్వాయుధ పోటీ తీవ్రమవుతున్నది. ఆయా దేశాలు తమ అణ్వాయుధ సంపత్తిని పెంచుకుంటున్నాయి. చైనా గత రెండేండ్లలోనే ఏకంగా 100 అణు వార్ హెడ్‌లను తన అమ్ములపొదిలోకి చేర్చుకున్నట్టు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) తన తాజా నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం చైనా వద్ద కనీసం 600 వార్‌హెడ్‌లు ఉన్నట్టు తెలిపింది. ఆయుధ నియంత్రణ విధానాలు బలహీనపడుతున్న ప్రస్తుత సమయంలో ప్రమాదకరమైన కొత్త అణ్వాయుధ పోటీ ఉద్భవిస్తున్నదని ఆందోళన వ్యక్తంచేసింది. అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్స్, చైనా, ఇండియా, పాకిస్థాన్, ఉత్తర కొరియా, ఇజ్రాయెల్ వంటి 9 అణ్వాయుధ దేశాల్లో దాదాపు అన్నీ 2024లో తీవ్రమైన అణ్వాయుధ ఆధునికీకరణ కార్యక్రమాలను కొనసాగించాయని, ఇప్పటికే ఉన్న ఆయుధాలను అప్‌గ్రేడ్ చేసి కొత్త వెర్షన్లను జోడించాయని సిప్రి నివేదిక పేర్కొన్నది. 2035 నాటికి చైనా 1500 అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని అనుకుంటున్నట్టు నివేదిక వెల్లడించింది.

ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాలు ఇలా..

- **12,241** జనవరి 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం అణ్వాయుధాలు
- **9,614** ఉపయోగం కోసం మిలిటరీలో సిద్ధంగా ఉన్న అణ్వాయుధాలు
- **3,912** క్షిపణులు, యుద్ధ విమానాలకు బిగించి ఉన్న అణు వార్‌హెడ్లు
- **2,100** బాలిస్టిక్ క్షిపణులకు బిగించి ఉన్న హై ఆపరేషన్ స్థితిలో ఉంచినవి

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర

- ఇరాన్‌కు ఆయన 'నంబర్ వన్ శత్రువు'
- ఇజ్రాయెల్ ప్రధాని సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అంతమొందించాలని ఇరాన్ కోరుకుంటున్నదని ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలను అడ్డుకుంటున్న ట్రంప్ ఆ దేశానికి 'నంబర్ వన్ శత్రువు'గా మారారని, కాబట్టి ఆయనను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నదని చెప్పారు. 'వారు ఆయన (ట్రంప్)ను చంపాలనుకుంటున్నారు. ఎందుకంటే ఆయన వారికి నంబర్ వన్ శత్రువు' అని పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయాత్మక నాయకుడని, బలహీనమైన రీతిలో బేరసారాలు చేయడానికి ఆయన ఎప్పుడూ ఇష్టపడరని, ప్రత్యర్థులకు ఆయన లొంగరని నెతన్యాహు పేర్కొన్నారు. 'వారి (ఇరాన్) వద్ద అణ్వాయుధం ఉండకూడదు. దీనర్థం వారు యురేనియంను శుద్ధి చేయకూడదు' అని నెతన్యాహు వివరించారు. తమ దేశం అణుముప్పును ఎదుర్కొంటున్నదని, కాబట్టి దూకుడుగా వ్యవహరించడం తప్ప మరో మార్గం లేదన్నారు.

ఖమేనీ అంతంతోనే యుద్ధానికి ముగింపు

ఇరాన్ సుప్రీం లీడన్ ఖమేనీని అంతం చేస్తేనే ఇరు దేశాల మధ్య యుద్ధానికి త్వరగా ముగింపు పడుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏబీసీ న్యూస్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్‌పై దాడులను సమర్థించుకున్నారు. ఖమేనీ హత్యకు ఇజ్రాయెల్ పన్నిన ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీటో చేసిన నేపథ్యంలో నెతన్యాహు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బంకర్‌లో దాక్కొన్న ఖమేనీ

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, ఆయన కుటుంబం టెహ్రాన్ ఈశాన్య ప్రాంతంలోని ఒక బంకర్‌లో దాక్కొన్నారని తెలిసింది. యురేనియాన్ని శుద్ధి చేసుకొనే కార్యక్రమాన్ని పూర్తిగా వదిలేసేందుకు ఖమేనీకి ఇజ్రాయెల్ చివరి అవకాశమిచ్చిందని.. అందువల్లే దాడులు జరిగిన మొదటి రోజైన శుక్రవారం రాత్రి ఆయనను హత్య చేయకుండా వదిలేసిందని ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ పేర్కొంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మరణించారని తెలిపింది.

టెల్ అవీవ్‌పై క్షిపణుల వర్షం

- ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకర దాడులు
- 8 మంది మృతి.. పలువురికి గాయాలు
- అమెరికా ఎంబసీపైనా ఎటాక్
- ఇరాన్ స్టేట్ టీవీపై ఇజ్రాయెల్ దాడి
- ఆయుధాగారాల సమీపంలోని ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని హెచ్చరిక
- అణు ఒప్పందానికి ఇరాన్ గుడ్‌బై!
- పార్లమెంట్‌లో బిల్లుకు సన్నాహాలు



టెల్ అవీవ్‌పై ఇరాన్ చేసిన క్షిపణి దాడితో ఎగిసి పడుతున్న మంటలు

దుబాయ్, జూన్ 16: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్నది. వరుసగా నాలుగో రోజు కూడా ఇరు దేశాలు పరస్పరం భీకర దాడులకు దిగాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ సోమవారం తెల్లవారుజామున జరిపిన క్షిపణి దాడుల్లో 8 మంది ఇజ్రాయెలీ పౌరులు మరణించారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి టెల్ అవీవ్‌లోని అమెరికా ఎంబసీని తాకింది. దీంతో కార్యాలయం స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనలో సిబ్బంది ఎవరూ గాయపడలేదని ఓ అధికారి తెలిపారు. మరోవైపు, తమ లక్ష్యాలు ఇంకా పూర్తి కానందున ఇరాన్‌లోని ఆయుధాగారాల సమీపంలోని ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలిపోవాలని ఇజ్రాయెల్ తాజాగా హెచ్చరించింది. ఇరాన్‌తో సైనిక ఘర్షణలు ప్రారంభమైన నాలుగవ రోజు సోమవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్ గగనతలంపై తమకు పట్టు చిక్కిందని ఇజ్రాయెలీ సైన్యం ప్రకటించింది. ఏ విధమైన సవాళ్లు లేకుండా టెహ్రాన్ గగనతలంపై తమ యుద్ధ విమానాలు విహరించగలవని ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌పై తమపై జరిపిన క్షిపణి, డ్రోన్ల దాడిలో ఇప్పటి వరకు 24 మంది మరణించగా 500 మందికిపైగా గాయపడ్డారని ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌కు చెందిన 120కి పైగా క్షిపణులను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇదిలా ఉండగా ఇరాన్ ప్రభుత్వ మీడియా ఐఆర్ఐబీ ప్రధాన కార్యాలయంపై సోమవారంం ఇజ్రాయెల్ బాంబు దాడి చేయడంతో ప్రత్యక్ష ప్రసారంలో ఉన్న టీవీ యాంకర్ ప్రాణ రక్షణ కోసం పరుగులు తీయాల్సి వచ్చింది. బాంబు దాడి కారణంగా పీఐబీ కార్యాలయం నల్లని దట్టమైన పొగతో నిండిపోయింది.

ఒప్పందం నుంచి వైదొలుగుతాం..

అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పీటీ) నుంచి వైదొలగేందుకు ఇరాన్ పార్లమెంట్ ఓ బిల్లును రూపొందిస్తున్నదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ సోమవారం ప్రకటించింది. అయితే భారీ విధ్వంసక ఆయుధాల తయారీ పట్ల ఇరాన్ వ్యతిరేకత కొనసాగుతుందని విదేశాంగ శాఖ వెల్లడించింది. అణ్వస్త్రాలను తయారుచేసే ఉద్దేశం ఇరాన్‌కు లేదని, అయితే అణు ఇంధనం, పరిశోధనపై తన హక్కును కొనసాగిస్తుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అంతకుముందు ప్రకటించారు. విధ్వంసక ఆయుధాలకు వ్యతిరేకంగా ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ తీసుకున్న మతపరమైన నిర్ణయాన్ని ఆయన పునరుద్ఘాటించారు. అణ్వస్త్రాలను, సంబంధిత టెక్నాలజీల వ్యాప్తిని నిరోధించేందుకు గతంలో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పీటీ) అంతర్జాతీయంగా ఏర్పడింది. ఇజ్రాయెల్‌తో ఘర్షణ ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఎన్‌పీటీ నుంచి వైదొలగాని ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కాల్పుల విరమణకు ఇరాన్ ఒత్తిడి

ఇజ్రాయెల్ కాల్పుల విరమణ చేసే విధంగా అమెరికాపై ఒత్తిడి పెంచాలంటూ గల్ఫ్ దేశాల ద్వారా ఇరాన్ ప్రయత్నాలు సాగిస్తున్నది. ఇరాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకునేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై ఒత్తిడి తీసుకు రావాలని ఖతార్, సౌదీ అరేబియా, ఒమన్‌లను ఇరాన్ ప్రభుత్వం కోరినట్టు 'రాయిటర్స్' కథనం పేర్కొన్నది.

ఇరాన్‌లో వరుస కారు బాంబు పేలుళ్లు

ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఏకకాలంలో వరుస కారు బాంబులను పేల్చివేసినట్లు ఇరాన్ వెల్లడించింది. శనివారం జరిగిన ఈ దాడులలో ఆరుగురు అణు శాస్త్రవేత్తలు మరణించినట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది.

ఎటూ గెలిచేది లేదు.. సంధి చేసుకోండి

ఇరాన్‌కు ట్రంప్ హితవు

ఇజ్రాయెల్‌తో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణల్లో ఇరాన్ గెలవలేదని, సమయం మించిపోక ముందే ఆ రెండు దేశాలు చర్చలు చేపట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. కెనడాలో జరుగుతున్న జీ7 సదస్సులో ట్రంప్ ఈ సూచన చేశారు. అమెరికా ఆస్తులపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టకూడదని కూడా ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తమ ఆస్తులపై ఏ రూపంలోనూ దాడులు చేయడానికి వీల్లేదని, ఒకవేళ అదే జరిగితే గతంలో ఎన్నడూ చూడని రీతిలో అమెరికా సాయుధ దళాలు ఇరాన్‌పై విరుచుకుపడతాయని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు.

మాపై అణుబాంబు వేస్తే పాక్ ప్రతిదాడి!

తమ దేశంపై ఇజ్రాయెల్ అణ్వస్త్రాలను ప్రయోగిస్తే పాకిస్థాన్ ఇజ్రాయెల్‌పై అణు బాంబు వేస్తుందని ఇరాన్ సీనియర్ అధికారి జనరల్ మొహసీన్ ర రెజేయీ ప్రకటించారు. అయితే ఈ ప్రకటనను పాక్ ఖండించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ తన అణు బాంబును ఉపయోగిస్తే తాము కూడా ఇజ్రాయెల్‌పై అణు బాంబు వేస్తామని పాకిస్థాన్ తమకు చెప్పిందని ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యుడు, ఐఆర్‌జీసీ కమాండర్ అయిన మొహసిన్ ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రకటించారు. అయితే ఈ వ్యాఖ్యలను పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ తోసిపుచ్చారు.

జనగణనకు కేంద్రం నోటిఫికేషన్

- జనాభా లెక్కలతోపాటే మొదటిసారి కులగణన
- 2026 అక్టోబర్ 1 నుంచి హిమపాత రాష్ట్రాల్లో
- 2027 మార్చి 1 నుంచి ఇతర రాష్ట్రాల్లో..
- రూ.13,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా



న్యూఢిల్లీ, జూన్ 16: దేశవ్యాప్తంగా 16వ జనగణనతోపాటు కులగణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. చివరిగా 2011లో దేశంలో జనగణన జరగగా మళ్లీ 16 సంవత్సరాల తర్వాత ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్నది. మంచు అధికంగా కురిసే లద్దాఖ్, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబర్ 1 నుంచి జనగణన ప్రారంభమవుతుంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో 2027 మార్చి 1వ తేదీ నుంచి జనగణన మొదలవుతుంది.

34 లక్షల మంది ఎన్యూమరేటర్లు

దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణను 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు నిర్వహిస్తారు. సుమారు 1.3 లక్షల మంది సెన్సస్ నిర్వాహకులు డిజిటల్ పరికరాలతో పాల్గొంటారు. జనగణనతోపాటు కులగణన కూడా జరుగుతుందని ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. జనగణన ఏర్పాట్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు విడతలలో జనగణనని నిర్వహిస్తారు. మొదటి విడతలో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్(హెచ్ఎల్ఓ), ప్రతి ఇంటి పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాలు సేకరిస్తారు. రెండవ విడతలో ఇంటింటి జనాభా లెక్కలు, ప్రతి ఇంటిలోని ప్రతి సభ్యుడి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలు సేకరిస్తారు. జనాభా లెక్కల సేకరణ దేశంలో ప్రారంభమైనప్పటి నుంచి ఇది 16వది. స్వాతంత్ర్యం తర్వాత ఇది 8వ సారి. జనాభా లెక్కల సేకరణ, వాటిని డిజిటల్ రూపంలో బదిలీ చేయడం, భద్రపరచడం వంటి అంశాలలో గట్టి భద్రతా ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

రూ.13,000 కోట్ల అంచనా వ్యయం

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన కోసం ప్రభుత్వానికి రూ. 13,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. రాజ్యాంగంలోని 246 అధికరణ ప్రకారం ఏడో షెడ్యూల్‌లో 69వ అంశంగా జనగణన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి చెందిన జనాభా లెక్కలను సేకరించవలసి ఉంటుంది. రానున్న జనాభా లెక్కల సేకరణలో కుల గణనను కూడా స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి ప్రభుత్వం చేర్చింది. చివరిసారి కులాల వారీగా గణాంకాల సేకరణ 1881 నుంచి 1931 మధ్య బ్రిటిష్ పాలకులు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత నిర్వహించిన అన్ని జనగణనల్లో కుల గణనను ప్రభుత్వాలు మినహాయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏప్రిల్ 30న జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణనను క్యాబినెట్‌లో ఆమోదిస్తామని లోక్‌సభలో హామీ ఇచ్చారు. అయితే అప్పటి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం కుల గణనను నిర్వహించడానికి బదులుగా సామాజిక-ఆర్థిక , కుల గణన పేరిట సర్వే వైపు మొగ్గు చూపింది.

గోయల్‌కు తప్పిన ప్రమాదం

హెలికాప్టర్ ఎక్కిన తర్వాత లోపం గుర్తింపు.. పర్యటన రద్దు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఏపీ పర్యటనలో ఉన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం తిరుపతి నుంచి కృష్ణపట్నం వెళ్లేందుకు హెలికాప్టర్ ఎక్కిన తర్వాత అందులో సాంకేతిక లోపం ఉన్నట్టు తేలడంతో ఆయన పర్యటన రద్దయింది. ఏపీ సీఎం చంద్రబాబు జిల్లాల పర్యటన సందర్భంగా ఈ హెలికాప్టర్ వాడుతుంటారు. ఇదే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడం కలకలం రేపింది. హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం కారణంగా కేంద్రమంత్రి తన పర్యటన రద్దు చేసుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోయారు. వీఐపీలు ప్రయాణించే హెలికాప్టర్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడంపై అధికారులు అలర్ట్ అయ్యారు. హెలికాప్టర్ ఘటనపై నివేదిక ఇవ్వాలని ఏపీ డీజీపీ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

విమానం మంటల్లో ఉండగా..

నడుచుకుంటూ బయటకు!

మృత్యుంజయుడు రమేశ్ మరో వీడియో వెలుగులోకి

అహ్మదాబాద్: ఎయిరిండియా విమానంలో ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్ ఘటనా స్థలి నుంచి ఎలా బయటకు వచ్చాడనే విషయాన్ని తెలిపే మరొక కొత్త వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. అందులో విమానం మంటల్లో కాలిపోతుండగా, బీజే వైద్య కళాశాల ప్రాంగణం నుంచి రమేశ్ నడుచుకుంటూ రావడం కనిపించింది. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించి ఇప్పటి వరకు 64 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందించినట్టు అధికారులు తెలిపారు. సోమవారం వరకు 99 మంది బాధితుల వివరాలను డీఎన్ఏ టెస్టు ద్వారా తెలుసుకోగలిగామన్నారు. ఇంకా గుర్తించని మృత దేహాల గురించి వారి బంధువులు ఆందోళనకు గురికావొద్దని సిటీ సివిల్ దవాఖాన సూపరింటెండెంట్ రాకేశ్ జోషి విజ్ఞప్తి చేశారు. 72 గంటల్లో పూర్తవుతుందని చెప్పిన డీఎన్ఏ పరీక్ష 84 గంటలైనా పూర్తి కాకపోవడంతో మృతుల బంధువులు సిటీ సివిల్ దవాఖాన వద్ద పడిగాపులు పడాల్సి వస్తున్నది. అయితే ప్రమాదంలో మృతదేహాలు గుర్తించలేనంత తీవ్రంగా కాలిపోవడంతో ఎముకల్లోని కణజాలాన్ని సేకరించి డీఎన్ఏ పరీక్షలు చేయాల్సి వస్తున్నదని.. అందుకే మృతదేహాల గుర్తింపు ఆలస్యమవుతున్నదని వైద్యులు తెలిపారు.

రెండు డ్రీమ్ లైనర్ విమానాల్లో సాంకేతిక సమస్య

టేకాఫ్ అయ్యాక వెనక్కి

న్యూఢిల్లీ: నింగిలో ఉండగా సాంకేతిక సమస్య తలెత్తడంతో రెండు డ్రీమ్‌లైనర్ విమానాలు మళ్లీ వెనక్కి మళ్లాల్సి వచ్చింది. సోమవారం ఉదయం హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి న్యూఢిల్లీ బయల్దేరిన ఎయిరిండియాకు చెందిన 787-8 డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్లు.. తాము ముందుకు వెళ్లదలచుకోలేదని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు తెలియచేసి తిరిగి విమానాన్ని హాంకాంగ్‌కు మళ్లించారు. ఉదయం 9.30 గంటలకు టేకాఫ్ అయిన హాంకాంగ్-న్యూఢిల్లీ విమానం 90 నిమిషాల్లోనే వాపసు వచ్చినట్లు ఆన్‌లైన్‌ట్రాకర్ ఫ్లైట్ రాడార్ 24 డాటా చూపించింది. మరోవైపు, ఆదివారం లండన్ నుంచి చెన్నై బయల్దేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన 787-8 డ్రీమ్‌లైనర్ విమానం నింగిలో సాంకేతిక సమస్య తలెత్తడంతో లండన్‌కు వాపసు వచ్చింది. టేకాఫ్ అయిన రెండు గంటల తర్వాత విమానం లండన్‌కు వాపసు వచ్చింది.

కీమో లేకుండానే క్యాన్సర్ చికిత్స!

- క్యాన్సర్ కణాలు ఆరోగ్యకర కణాలుగా ప్రవర్తించేలా రీప్రోగ్రామింగ్
- దక్షిణ కొరియా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ

సియోల్, జనవరి 16: క్యాన్సర్ చికిత్స నియమాలను తిరగరాసే ఆవిష్కరణను దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రాణాంతక క్యాన్సర్ కణాల స్వభావాన్ని.. వాటిని ధ్వంసం చేయకుండానే సాధారణ కణజాలంగా మార్చివేశారు. ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధికి అందిస్తున్న చికిత్సలో కణితుల్లోని రోగకారక కణాలను ధ్వంసం చేస్తారు. దీంతో వాటి సమీపంలోని ఇతర ఆరోగ్యకరమైన టిష్యూ సైతం ప్రభావితమవుతుంది. ఈ నేపథ్యలో వ్యాధిగ్రస్తమైన కణాలను రేడియేషన్ లేదా కీమోథెరపీతో ధ్వంసం చేయకుండా పరిశోధకులు వాటిని సాధారణ కణజాలంలాగా ప్రవర్తించే విధంగా రీప్రోగ్రామింగ్ చేశారు. కొలొరెక్టల్ క్యాన్సర్‌పై జరిపిన ఈ విజయవంతమైన ప్రయోగంలో కణితులు ధ్వంసం కాకపోగా అవి విమోచించబడ్డాయని పరిశోధకులు పేర్కొన్నారు. తమ పరిశోధన వివరాలను అడ్వాన్స్‌డ్ సైన్స్ మ్యాగజైన్‌లో ప్రచురించారు. ఈ పరిశోధనకు కొరియా అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ క్వాంగ్ హ్యూన్ చో నేతృత్వం వహించారు. కణజాలాల పరివర్తనకు మార్గనిర్దేశం చేయడానికి ఆయన డిజిటల్ ట్విన్ అనే శక్తిమంతమైన గణన నమూనాను ఉపయోగించారు. ప్రస్తుతం సంప్రదాయ పద్ధతుల్లో జరుపుతున్న క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ లేదా కీమోథెరపీ వల్ల వ్యాధిగ్రస్తమైన కణాలకు సమీపంలో ఉండే ఆరోగ్యకరమైన కణజాలం కూడా ప్రభావితమవుతున్నది. దీంతో రోగిలో సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. దీనిని నివారించడానికి చోబృందం ఓ కొత్త మార్గాన్ని ఎంచుకున్నది. క్యాన్సర్ కణాలు నియంత్రించలేని స్థాయిలో పెరుగకుండా వాటిని వేరుచేసి, భిన్నమైన, స్థిరమైన మార్పుకు గురిచేసే పద్ధతిని కనుగొన్నది. ఒక కణం ప్రాణాంతకంగా లేదా సాధారణంగా ప్రవర్తించే విధంగా నియంత్రించే కీలక జన్యు నియంత్రకాలను బెనైన్ అనే పద్ధతి ద్వారా గుర్తించారు.

రేడియేషన్ లేకుండానే

క్యాన్సర్ కణతుల గుర్తింపు!

- కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐఐఎస్‌సీ పరిశోధకులు
- పీఈటీ, ఎంఆర్ఐల కన్నా చౌక

బెంగళూరు: రేడియేషన్ లేకుండా, సురక్షితంగా కణుతులను గుర్తించే ఇమేజింగ్ మాలిక్యూల్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది మానవ శరీరానికి హాని చేయదని, చౌకగా అందుబాటులో ఉంటుందని వీరు చెప్పారు. ఈ కొత్త విధానం ఖరీదైన పీఈటీ స్కాన్స్‌కు బదులుగా అందుబాటులోకి వస్తుందన్నారు. దీనివల్ల క్యాన్సర్ రోగ నిర్ధారణ తక్కువ వనరులతోనే చేరువవుతుందని తెలిపారు. ఈ అధ్యయన నివేదికను జేఏసీఎస్ ఏయూ ప్రచురించింది. ఐఐఎస్‌సీలోని బయోఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈ అధ్యయన నివేదిక కరస్పాండింగ్ ఆథర్ సంహిత సిన్హరే మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో, పీఈటీ, ఎంఆర్ఐల కన్నా చౌక ధరలో, ఆ పరీక్షల ద్వారా తెలుసుకోగలిగిన సమాచారాన్ని తాము అభివృద్ధి చేసిన విధానం ద్వారా తెలుసుకోవచ్చునని చెప్పారు.

పీఈటీ స్కాన్స్‌తో సమస్యలు

కణుతులు (ట్యూమర్లు)ను గుర్తించడానికి పాసిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ (పీఈటీ) అత్యున్నత స్థాయి ప్రామాణికమైనది. పీఈటీ స్కాన్స్ తీసేటపుడు 18ఎఫ్-ఎఫ్‌డీజీ వంటి రేడియోయాక్టివ్ గ్లూకోజ్ ట్రేసర్స్‌ను ఇంజెక్ట్ చేస్తారు. ఇవి కణితి ఉన్న ప్రదేశంలో పోగుపడతాయి. స్కానింగ్ చేసేటపుడు ఆ ప్రదేశాలను ప్రకాశవంతంగా చేస్తాయి. అయితే, పీఈటీ చాలా ఖరీదైనది. అంతేకాకుండా, దీనివల్ల రేడియేషన్ ముప్పు ఉంటుంది.

మరిన్ని ట్రయల్స్ అవసరం..

జీవ వ్యవస్థకు బయట జీపీసీ అనే అణువు (మాలిక్యూల్)ను ఐఐఎస్‌సీ టీమ్ రూపొందించింది. ఇది సున్నితత్వం, వైవిధ్యాలను నాటకీయంగా పెంచగలదు. దీనివల్ల ట్యూమర్‌ను సులువుగా గుర్తించడం సాధ్యమవుతుంది. ఆరోగ్యానికి ముప్పు లేకుండానే మళ్లీ మళ్లీ స్కాన్స్ తీయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. ఇది ప్రస్తుతం ప్రయోగశాల అధ్యయనాల్లో ఉంది. దీనిపై మరింత క్లినికల్ ట్రయల్స్ అవసరం.

పీఏ ఇమేజింగ్‌తో మేలు

ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన కొత్త విధానం పీఏ ఇమేజింగ్. దీనిలో రేడియేషన్‌ను వినియోగించరు. శరీరంలోని వైవిధ్యంతో కూడిన అణువులను ప్రకాశింపజేయడానికి నియర్ ఇన్‌ఫ్రారెడ్ లైట్‌ను ఈ విధానంలో ఉపయోగిస్తారు. ఈ అణువులు (మాలిక్యూల్స్) శబ్ద తరంగాలను విడుదల చేస్తాయి. ట్యూమర్ ఇమేజెస్‌ను రూపొందించడానికి ఈ శబ్ద తరంగాలు ఉపయోగపడతాయి.

సౌదీ విమానం టైర్ల నుంచి పొగలు

242 మంది హజ్ యాత్రికులతో లక్నోలో ల్యాండింగ్

లక్నో, జూన్ 16: జెడ్డా నుంచి 242 మంది హజ్ యాత్రికులతో బయల్దేరిన ఓ సౌదీ విమానం ఆదివారం లక్నోలో ల్యాండ్ అవుతుండగా, విమానం టైర్ల నుంచి పెద్ద ఎత్తున పొగలు, నిప్పురవ్వలు వెలువడ్డాయి. దీంతో విమానాశ్రయంలో అలారం మోగిందని, అయితే విమానంలోని హజ్ యాత్రికులంతా సురక్షితంగా బయటకు దిగారని ఇక్కడి చౌదరీ చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు తెలిపారు. రెస్క్యూ, అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి విమానానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నారని చెప్పారు. విమానాశ్రయంలో విమాన సర్వీసులకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడలేదని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక లోపం మాత్రమే సౌదీ విమానంలో తలెత్తిందని, ఆ విమానం తిరిగి జెడ్డాకు వెళ్లిపోయిందని అధికార వర్గాలు తెలిపాయి. విమానంలోని హజ్ యాత్రికులంతా సురక్షితంగా ఉన్నారని, వారి ప్రయాణం ఎలాంటి ఆటంకం లేకుండా ముగిసిందని ఉత్తరప్రదేశ్ మంత్రి అన్సారీ మీడియాకు తెలిపారు.